# మరోసారి ఆశీర్వదించండి

- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి
- గ్రామాల్లో జోరుగా బీఆర్ఎస్ ప్రచారం
- ఘన స్వాగతం పలుకుతున్న ప్రజలు



పెద్దఅంబర్‌పేట : బాటసింగారంలో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి బతుకమ్మలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

పెద్దఅంబర్‌పేట, నవంబర్ 17: మరింత అభివృద్ధి చేసేందుకు మరోసారి ఆశీర్వదించాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పిగ్లిపూర్, కొత్తగూడెం, బాటసింగారం, జాఫర్‌గూడ, పీర్లగూడెం, మజీద్‌పూర్, గుంతపల్లి, ఇనాంగూడ, లష్కర్‌గూడ, సుర్మయగూడ, గండిచెరువు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కిషన్‌రెడ్డికి మహిళలు ఘన స్వాగతం పలికారు. మంగళహారతులు, బతుకమ్మలతో గ్రామాల్లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలోనూ రూ.కోట్ల నిధులతో సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని చెప్పారు. ఐదేండ్లకోసారి వచ్చే మాయగాళ్ల మాటలు నమ్మొద్దని సూచించారు. ఎన్నికల వేళ అప్రమత్తంగా ఉండకపోతే.. ఆ తర్వాత బలిపశువులం కావాల్సి వస్తుందన్నారు. మరోసారి బీఆర్ఎస్‌కే ఓటేసి.. నాలుగోసారి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త కిషన్‌గౌడ్, కోట వెంకట్‌రెడ్డి, సీనియర్ నాయకులు నోముల కృష్ణ, లెక్కల విఠల్‌రెడ్డి, చక్రధర్‌గౌడ్, సర్పంచ్‌లు కోట రాజలక్ష్మారెడ్డి, ఎర్రవెల్లి లతశ్రీ, కొర్ర లావణ్య, పారిజాత, ఎంపీటీసీ సీక సాయికుమార్‌గౌడ్, నాయకులు నారోజు రాజారాంచారి, జంగయ్యయాదవ్, ఉమాకాంత్, వెంకటేశ్‌యాదవ్, ఎడ్ల మహేందర్, గోపగోని శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



యాచారం : రోడ్‌షోకు భారీ సంఖ్యలో హాజరైన జనం

**రోడ్ షోకు విశేష స్పందన**

యాచారం : ఐదేండ్లకోసారి ఎన్నికలప్పుడు మాత్రమే ఓట్ల కోసం కనిపించే నాయకుల మాయమాటలతో మోసపోవద్దని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. మండలంలోని మల్కీజ్‌గూడ, తక్కళ్లపల్లితండా, తక్కళ్లపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో గురువారం రాత్రి రోడ్‌షో నిర్వహించారు. ఆయా గ్రామాలలో కిషన్‌రెడ్డి రోడ్‌షోకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. అవినీతి కాంగ్రెస్‌కు ఓటేస్తే పేదలకు సంక్షేమ పథకాలు ఒక్కటి కూడా సక్రమంగా అందక పేదల బతుకులు ఆగమైతాయని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే ఎలాంటి కష్టాలు ఉండవన్నారు. కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, జడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి పాచ్చ భాష, సర్పంచ్‌లు జగదీశ్, సంతోష, హబీబుద్దీన్, ఎంపీటీసీలు శారద, సుమతమ్మ, నాయకులు తలారి మల్లేశ్, చిన్నోళ్ల యాదయ్య, చిక్కుడు గుండాలు, అబ్బయ్య, లోహిత్‌రెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

**అభివృద్ధి ప్రదాతను ఆశీర్వదించండి**

ఇబ్రహీంపట్నం : నియోజకవర్గాన్ని ప్రతిక్షణం అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోయే అభివృద్ధి ప్రదాత మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి మరోసారి అవకాశం కల్పించాలని ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిదిలోని పలు వార్డుల్లో కౌన్సిలర్లతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : పథకాలపై అవగాహన కల్పిస్తున్న కౌన్సిలర్ నీలం శ్వేత తదితరులు

**మంచిరెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించాలి**

ఇబ్రహీంపట్నంరూరల్ : బీఆర్ఎస్ గెలుపుకోసం కార్యకర్తలు, నాయకులు కంకణ బద్ధులై పనిచేయాలని ఎంపీపీ కృపేశ్ అన్నారు. మండల పరిధిలోని పోచారం గ్రామంలో శుక్రవారం బీఆర్ఎస్ అభ్యర్థి మంచిరెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమంలో ఇబ్రహీంపట్నం ప్రాంతాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా నిలిపిన మంచిరెడ్డిని మరోసారి గెలిపించాలని కోరారు. మంచిరెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధిలో ముందుకు సాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బుగ్గరాములు, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం**

ఆదిబట్ల : కారు గుర్తుకు ఓటేసి మరోసారి మంచిరెడ్డి కిషన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి అన్నారు. ఎంపీ పటేల్‌గూడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం రవీందర్‌గౌడ్, ఆదిబట్ల మున్సిపల్ ప్రధాన కార్యదర్శి పొట్టి శ్రీకాంత్, మున్సిపల్ కోఆప్షన్ అబేదాబేగం, నరసింహ, గజ్జెల లక్ష్మి, అశోక్, జగన్, బాలరాజు, రమేశ్, శ్రీను పాల్గొన్నారు.

## భారీ మెజార్టీతో గెలిపించుకుందాం



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి

పెద్దఅంబర్‌పేట, నవంబర్ 17: కలిసికట్టుగా పనిచేయాలని, సీనియర్ల రాకతో బీఆర్ఎస్‌కు భారీ మెజారిటీ ఖాయమైందని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దండెం రాంరెడ్డిని శుక్రవారం మున్సిపాలిటీలోని పార్టీ కార్యాలయంలో కలిసి ఆయన మాట్లాడారు. ఆయన సోదరులు కౌన్సిలర్ దండెం కృష్ణారెడ్డి, నర్సింహారెడ్డిలను సన్మానించారు. అనంతరం ప్రశాంత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. అంతా ఐక్యంగా ముందుకుసాగాలన్నారు. మున్సిపాలిటీతోపాటు మండలంలో బీఆర్ఎస్‌కు భారీ మెజారిటీ తీసుకొచ్చేందుకు కష్టపడి పనిచేయాలని కోరారు. అనంతరం దండెం రాంరెడ్డి మాట్లాడుతూ.. నాలుగోసారి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి గెలుపు ఖాయమైందని, భారీ మెజారిటీనే లక్ష్యంగా ప్రచారం నిర్వహిస్తామని చెప్పారు. దొంగ సర్వేలతో కాంగ్రెస్ టికెట్ తెచ్చుకునోళ్లకు ఓటమి తప్పదన్నారు. కార్యక్రమంలో జక్కా రాంరెడ్డి, కంచర్ల సత్యనారాయణరెడ్డి, అనంతుల వెంకటేశ్వర్‌రెడ్డి, ఈదమ్మల బలరాం, కళ్లెం ప్రభాకర్‌రెడ్డి, పాశం దామోదర్, చెరుకూరి జగన్, దేశారం బాలకృష్ణగౌడ్, పిల్లి నగేశ్, ఎండీ సత్తార్, అచ్యుత్, పొగాకు నర్సింహగౌడ్, దిండు ప్రవీణ్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఓటు వజ్రాయుధం

ఇబ్రహీంపట్నంరూరల్, నవంబర్ 17 : ఓటు ప్రతి ఒక్కరికీ వజ్రాయుధం లాంటిదని, దాని విలువ తెలుసుకుని హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ రవీంద్ర సాగర్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గ కేంద్రంలో హెచ్ఆర్‌డీ విద్యాలయం ఆధ్వర్యంలో 'కాస్ట్ యువర్ ఓట్ ఫర్ బ్రైట్ ఫ్యూచర్' అనే నినాదంపై రోడ్‌షోతో పాటు నాటకం రూపంలో నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్ఐలు పుష్పలత, కృష్ణ, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ ప్రవీణ్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గెలుపు కోసం ఐక్యంగా పని చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల యాదగిరి

ఇబ్రహీంపట్నం, నవంబర్ 17 : నిరంతరం అభివృద్ధికోసం పాటుపడే ఇబ్రహీంపట్నం అభివృద్ధి ప్రదాత, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి మరోసారి గెలిపించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల యాదగిరి అన్నారు. శుక్రవారం ఇబ్రహీంపట్నం మున్సిపల్‌పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధికోసం పరితపించే మంచిరెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి గెలుపుకోసం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కంకణబద్ధులై పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు యాచారం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## అబ్జర్వర్‌గా ఐఏఎస్ నినామా

ఇబ్రహీంపట్నం, నవంబర్ 17 : ఇబ్రహీంపట్నం అసెంబ్లీ ఎన్నికల అబ్జర్వర్‌గా ఐఏఎస్ ఆర్ఎస్ నినామాను ఎన్నికల కమిషన్ నియమించింది, ఎలాంటి అపోహలున్నా, ఫిర్యాదులు చేయాలన్నా ప్రతిరోజూ మధ్యాహ్నం 12 నుంచి 1గంటల వరకు అందుబాటులో ఉంటారని, 9426018818 నెంబర్‌కు ఫిర్యాదులు చేయాలని తెలిపారు.

## పోలింగ్ స్టేషన్ల పరిశీలన

కొత్తూరు, నవంబర్ 17: కొత్తూరు మండలంలోని పలు సమస్యాత్మక పోలింగ్ బూత్‌లను ఎలక్షన్ జనరల్ అబ్జర్వర్ ఐఏఎస్ చంద్రకాంత్ శుక్రవారం పరిశీలించారు. మండల పరిధిలోని ఇన్ముల్‌నర్వ, పెంజర్ల, కొడిచెర్ల, మల్లాపూర్, గూడూర్, తీగాపూర్, కొత్తూరు బూత్‌లను ఆయన సందర్శించారు. భద్రతా చర్యల గురించి కొత్తూరు సీఐ శంకర్‌రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శరత్‌చంద్రబాబు, తహసీల్దార్ జానకి తదితరులు పాల్గొన్నారు.

## అప్పు ఇవ్వలేదని మహిళ హత్య

యాచారం, నవంబర్17: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని ముచ్చర్ల గ్రామ శివారులో రెండు రోజుల క్రితం ఓ మహిళ దారుణ హత్యకు గురైన ఘటన తెలిసిందే. మహిళ హత్య కేసు శుక్రవారం పోలీసులు ఛేదించారు. డబ్బు కోసమే మహిళను దారుణంగా హత్య చేసినట్లు విచారాణ ద్వారా పోలీసులు నిర్ధారించారు. అప్పు ఇవ్వలేదని ఓ నిండు ప్రాణాన్ని బలిగొన్నాడు. సీఐ రామాంజనేయులు తెలిపిన కథనం ప్రకారం..మంచాల మండలం జాపాల గ్రామానికి చెందిన బత్తోజు సందీప్ కుమార్ (30) అనే వ్యక్తి తన గ్రామంలో ఇంటి నిర్మాణం కోసం నాలుగు లక్షలు అప్పు చేశాడు. అదే గాక ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో రెండు లక్షల నష్టం వచ్చింది. అట్టి అప్పులను అతని జీతం వల్ల తీర్చలేక పోయాడు. దీంతో అదే గ్రామానికి చెందిన మంథని యాదమ్మ అనే మహిళను లక్ష రూపాయలు అప్పు అడుగుదామని అనుకున్నాడు.

అప్పటికే సందీప్‌కుమార్ ఓ కారును అద్దెకు తీసుకున్నాడు. ఆమె తుర్కయాంజాల్‌లోని విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయంలో డ్యూటీ ముగించుకొని సాయంత్రం 4.40 గంటలకు ఇంటికి వస్తుండగా తను ఆమె వద్దకు వెళ్లాడు.జాపాలకు వెళ్తున్నాను తీసుకెళ్తానని ఆమెను నమ్మించాడు. అక్కడి నుంచి కందుకూరు వెళ్లే మార్గంలో ఓ నిర్మానుష్యమైన ప్రాంతంలో కారును ఆపి యాదమ్మను లక్ష రూపాయలు అప్పు అడిగాడు. ఆమె తనవద్ద డబ్బులు లేవని ఆమె వాదించింది. డబ్బులు లేకుంటే ఒంటిమీద బంగారు నగలు ఉన్నాయి కదా.. నీ మెడలో ఉన్న పుస్తెల తాడును ఇస్తే కుదువబెట్టుకుంటా అన్నాడు. దానికి ఆమే ససేమిరా అంటూ అతనిని కాలితో తన్నింది. దీంతో కారు ముందలి అద్దం పగిలింది. బంగారం తీసుకోవడానికి ఆమె సహకరించకపోవడంతో తన జుట్టుతోనే గొంతుకకు బిగేసి గొంతు నులిమి చంపేశాడు. ఆమె చనిపోయిందని నిర్ధారించుకున్న తరువాత ఆమె వద్ద నుండి బంగారు పుస్తెల తాడు, ఒక లాకెట్, నాలుగు గుండ్లు, చేతికి ఉన్న రెండు ఇత్తడి గాజులు, బంగారు కమ్మలు, మాట్నీలు, సెల్‌ఫోన్, హ్యాండ్ బ్యాగ్‌ను తీసుకున్నాడు. శవాన్ని కారులో పెట్టుకొని కడ్తాల్ రూట్‌లోని ఓ పెట్రోల్ పంపులో బాటిల్‌లో పెట్రోల్ తీసుకున్నాడు. యాదమ్మ మృతదేశాన్ని కందుకూరు మండలం ముచ్చర్ల గ్రామ శివారులో జన సంచారం లేని ప్రాంతంలో చెట్ల పొదల్లో శవాన్ని పడేసి పెట్రోల్ పోసి నిప్పంటించాడు. అక్కడి నుంచి తప్పించుకొని తిరుగుతుండగా సీసీ ఫుటేజీ ఆధారంగా వాహనాల తనిఖీల్లో భాంగా నిందితుడిని గుర్తించారు. పోలీసు విచారణలో సందీప్‌కుమార్ నేరం అంగీకరించాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.